


www.tharanam.net

# తరణం

THARANAM

POSTAL REG-NUMBER CDP/035/2023-2025

RNI NO APTEL/2016/69526


**తరణం శుభమస్తు**
**శనివారం** అక్టోబర్ 19 2024
శ్రీ క్రోధి నామ సంవత్సరందక్షిణాయణం - శరదృతువుఆశ్వయుజ మాసం - బహళ పక్షం
తిథి:విదియ మ12.46
వరకువారం:శనివారం(స్థిరవాసరే)
నక్షత్రం:భరణి మ2.32 దుర్ముహూర్తము:ఉ5.55 - 7.29అమృతకాలం:ఉ10.02 - 11.32
రాహుకాలం:ఉ9.00 - 10.30
యమగండ/కేతుకాలం:మ1.30 - 3.00
సర్వేజనా సుఖినో భవంతు -శుభమస్తు
వి మల్లికార్జున స్వామి


సంపుటి : 09 సంచిక : 44 | వైఎస్ఆర్/కడప | శనివారం 19 అక్టోబర్ 2024 | ఎడిటర్.. నీలం ఆంజనేయ రెడ్డి | పేజీలు :08 | వెల: రూ. 4.00

Vol : 09 Issue : 44 | YSR/KADAPA | Saturday, 19 October 2024 | Editor. Neelam .Anjaneya Reddy | Pages:08 | Rs. 4.00


## మరోసారి రష్యా పర్యటనకు ప్రధాని మోదీ



ఇంటర్నెట్ డెస్క్: అక్టోబర్ 18. (తరణం బ్యూరో)భారత ప్రధాని నరేంద్ర మోదీ రష్యా పర్యటన ఖరారైంది. మాస్కో అధ్యక్షతన వచ్చే వారంలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో మోదీ పాల్గోనున్నారు.ఈమేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటించింది.రష్యాలోని కజన్ వేదికగా ఈనెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈసదస్సుకు హాజరవ్వాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వయంగా మోదీని ఆహ్వానించారు. అందులోభాగంగానే ఈనెల 22 నుంచి 23 వరకు మోదీ రష్యాలో పర్యటించనున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. ఈసందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారని వెల్లడించింది.

## ప్రజలు మనల్ని విశ్వసించారు.. అందరిపై బాధ్యత ఉంది

### సీఎం చంద్రబాబు



అమరావతి: అక్టోబర్ 18 (తరణం బ్యూరో)గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైకాపా సర్వనాశనం చేసిందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆ పార్టీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.తనను జైల్లో పెడితే పవన్‌కల్యాణ్ వచ్చి పరామర్శించి.. తెదేపాతో కలిసి పోటీ చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు. మోదీ నుంచి అందరూ నేర్చుకోవాలని.. పట్టుదల, కృషి వల్లే ఆయన మూడోసారి ప్రధాని అయ్యారని కొనియాడారు. వైకాపా చేయని తప్పులు లేవని.. అందుకే ప్రజలు చిత్తుగా ఓడించారని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమికి 93 శాతం స్ట్రయిక్‌రేట్ ఇచ్చారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.అండగా ఉన్న వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం"దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ తెదేపా. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది సమీక్షించాలి. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నాం. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఎన్నికల సీట్ల కేటాయింపులో తెదేపాకు అండగా ఉన్నవర్గాలకు ప్రాధాన్యం కల్పించాం. ఇంతవరకు ప్రాతినిధ్యం దక్కని వారికి అవకాశం కల్పించాం. 'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాం.రాజకీయ పార్టీ.. కుటుంబం లాంటిదేగెలిచాం మన పని అయిపోయిందని అనుకుంటే చాలా సమస్యలు వస్తాయి. ఎన్నికల సమయంలో ఉన్న పరిస్థితుల వల్ల పార్టీని నమ్ముకున్న కొంతమందికి సీట్లు ఇవ్వలేకపోయాం. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చాం. ప్రజలు మనల్ని విశ్వసించారు.. దాని ప్రకారం ముందుకెళ్లాలి. ఇప్పుడు అందరిపై బాధ్యత ఉంది. కొత్త ఎమ్మెల్యేలు 65 మంది ఉన్నారు. 18 మంది కొత్త మంత్రులు ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల్లో దాదాపు 80 మంది వరకు కొత్తవారే. కుటుంబంలోనే భేదాభిప్రాయాలు ఉంటాయి. ఫ్యామిలీని ఐక్యంగా ఉంచేందుకు ఇంటిపెద్ద ఆలోచిస్తుంటారు. రాజకీయ పార్టీ కూడా అంతే. నాపై ఆ బాధ్యత ఉంది. అధికారంలోకి రాగానే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. రాష్ట్రంలో ఏ అరాచకం చూసినా దాని వెనుక గంజాయి బ్యాచ్ ఉంటుంది. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం వచ్చింది కనుక నిలదొక్కుకుంటున్నాం. 16,437 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం భూ ఆక్రమణలపైనే ఉన్నాయి. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. ప్రజలు మనల్ని అనుమానించే పరిస్థితి రాకూడదు. ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ ముఖ్యం. వరదలు వస్తే ఎలా పనిచేశామో చూశాం. యుద్ధప్రాతిపదికన పనులు చేశాం.. అందరినీ ఆదుకున్నాం.

## 'సాక్షి'పై పరువు నష్టం దావా కేసు

### విశాఖ కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్



విశాఖ: అక్టోబర్ 18 (తరణం బ్యూరో)పరువు నష్టం దావా కేసులో మంత్రి నారా లోకేశ్ విశాఖ కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఆయన సాక్షి మీడియాపై రూ.75 కోట్లకు పరువు నష్టం దావా వేశారు.తన పరువుకు భంగం కలిగించేందుకు అసత్య కథనాలు ప్రచురించారని అందులో పేర్కొన్నారు. తప్పుడు కథనం రాసిన ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని లోకేశ్ కొంత కాలంగా పోరాటం చేస్తున్నారు. ఆయన తరఫు న్యాయవాదులు శుక్రవారం కోర్టులో వాదనలు వినిపించనున్నారు.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు



దిల్లీ: అక్టోబర్ 18. (తరణం బ్యూరో)రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్ష వాయిదా వేయాలని కోరారు.జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షల నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్ -1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: అక్టోబర్ 18 (తరణం బ్యూరో)డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ జరగదని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని 30 శాతం జనాభా హైదరాబాద్‌లోనే ఉందన్నారు.మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. ఇప్పుడున్న మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి అభివృద్ధి చేయవచ్చని సూచించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చవద్దని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ ఎక్స్ రోడ్‌లో స్థానిక ఎమ్మెల్యే గోపాల్‌తో కలిపి సేవరేజ్ లైన్‌ను కిషన్ రెడ్డి ప్రారంభించారు.మూసీ సుందరీకరణ పనులు చేయండి.. మూసీ పక్కన ముఖ్యమంత్రి ఇల్లు కట్టండి' మాకేమీ అభ్యంతరం లేదని ఎద్దేవా చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం.. రూ.25వేలు ఇస్తాం.. ఖాళీ చేయమనడం న్యాయం కాదని హితవు పలికారు. స్థానిక ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చని సూచించారు.

## రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర

### హోంమంత్రి అనిత



అమరావతి: అక్టోబర్ 18. (తరణం బ్యూరో)జగన్ కుట్రలన్నీ సమర్థంగా తిప్పికొడుతున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు.రోజుకో అబద్ధం చెప్పి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర అని విమర్శించారు. ఆ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.ఎవరు తప్పు చేసినా చంద్రబాబు సహించరు: మండిపల్లి రామ్‌ప్రసాద్‌క్రమశిక్షణకు సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ అన్నారు. ఎవరు తప్పు చేసినా ఆయన సహించరన్నారు. ప్రజలకు సుపరిపాలనే లక్ష్యంగా పార్టీ సమావేశం జరుగుతోందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిదే విజయం: నిమ్మలరైతు సంఘాలు, నీటి సంఘాలను వైకాపా నిర్వీర్యం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. రైతు ప్రాతినిధ్యంతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ విదేశాల్లోని తెలుగువారంతా పార్టీ సభ్యత్వంపై ఆసక్తి చూపిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. శాశ్వత సభ్యత్వానికి చాలా మంది ముందుకొస్తున్నారని చెప్పారు.

## ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్ వృద్ధి రేటు మెరుగ్గా ఉంది

### ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు




ఇంటర్‌నెట్‌డెస్క్: అక్టోబర్ 18 (తరణం బ్యూరో)ఆర్థికవ్యవస్థలో భారత్ పాత్ర గురించి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్ వృద్ధి రేటు మెరుగ్గా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈవిషయంలో ఏ సందేహం లేదన్నారు. భారత్ వృద్ధి రేటు పెరుగుదలలో మెజార్టీ పాత్ర దేశీయ మార్కెట్లదేనని.. ఆరోగ్యకరమైన వాతావరణానికి ఇది సూచిక అని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ వార్షిక సమావేశానికి సంబంధించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అయితే దేశ ప్రజల జీవన నాణ్యత, పరిశుభ్రమైన గాలి, నీటి లభ్యత గురించి భారత్ చర్యలు చేపట్టాలని అజయ్ బంగా సూచించారు. భవిష్యత్తులో ఈ అంశాలపై భారత్ మరిన్ని ప్రాజెక్టులు రూపొందించాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్థికవృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని భారత్ మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల సుస్థిర అభివృద్ధికి ప్రపంచబ్యాంకు మద్దతిస్తుందన్నారు.

# మత్తు పదార్థాల వ్యసనం

## మాదక ద్రవ్యాల వినియోగంపై నెహ్రూ యువ కేంద్రం అవగాహన సదస్సు



(విశాఖపట్నం.అక్టోబర్18,తరణం ప్రతినిధి)మత్తు పదార్థాల వ్యసనం – మాదక ద్రవ్యాల వినియోగంపై నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన అవగాహన సదస్సు విజయవంతం అయ్యింది.యూత్ హాస్టల్ లో నిర్వహించిన ఈ సదస్సులో విశాఖపట్నం జిల్లా కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసెల్ కమిషన్ సభ్యురాలు రహమున్నిసా బేగం,ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మత్తు పదార్థాలు సేవించి యువత దారి తప్పుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.యువత పెడదారులు పట్టి,సాంఘిక దురాచారాలు,నేర ప్రవృత్తితో జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు.దీనిని కట్టడి చేసి చేయడంలో యువత పాత్ర ముఖ్యమైందని పేర్కొన్నారు.స్థానిక మూడవ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత నేరాలలో మత్తు పదార్థాలు సేవించి దాని ద్వారా వివిధ అరాచకములలో పాల్గొంటున్నట్లుగా వివిధ క్రైమ్ రికార్డ్స్ ద్వారా స్పష్టం చేస్తున్నాయని అన్నారు.ఈ విధమైన నేరాలు అరికట్టడంలో యువతని వాళ్ళు మార్గదర్శకత్వం చేయడంలో యువత ముందుండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సమిధ – ఐ.డి.యు.ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.రవి కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వాలంటరీ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ నుండి కే.సురేష్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వ్యసనం అనేది పట్టణాలలో కాకుండా గ్రామీణ ప్రాంతాలలో కూడా విపరీతంగా పెరిగిపోయిందని దాని ద్వారా యువత దారి తప్పుతున్నట్టుగా తెలిందని అలాగే వారి యొక్క విద్యా సంబంధ విషయాలపై ఏకాగ్రత పెట్టలేకపోతున్నారని అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జ్ కే.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ,యువత మత్తు పదార్థాలకు బానిస అయిన వాళ్లను,వాళ్ళ ఆరోగ్య పరిరక్షణ సెంటర్స్ ద్వారా వాళ్లని తిరిగి మత్తు పదార్థాలను విసర్జించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నదని,వాటి ద్వారా మత్తు పదార్థాల వినియోగ స్తులు అవగాహన కల్పించుకోవాలని,వాటిని వ్యతిరేకరించేటట్లు చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని, పేర్కొంటూ ఆ బాధ్యత యువ నాయకులు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు,ఈ కార్యక్రమానికి స్థానిక నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి. ఉమామహేశ్వర రావు అధ్యక్షత వహించగా అధ్యక్ష ఉపన్యాసం ఇస్తూ,ప్రతి జిల్లాలో మత్తు 1ఆపదార్థాల వ్యసనాన్ని మరిఎం మనయొక్క వినియోగం తగ్గించడంలో యువత కీలక పాత్ర వహించాలని,కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లా నుండి కనీసం 50 మంది యువతీ యువకులను ఎంపిక చేసి వారి ద్వారా మత్తు పదార్థాలు వ్యసనం నుంచి మార్పించడంలో ముఖ్య భూమిక వహించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 60 మంది యువతీ యువకులు పాల్గొని, ఈ ట్రైనింగ్ నందు నేర్చుకున్న విషయాలను,వారి ప్రాంతాలలో ప్రతి ఇంటికి వెళ్లి మత్తు పదార్థాలు వ్యసనం, దుర్వినియోగం వాటి మీద అవగాహన కల్పించే కార్యక్రమం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.రాష్ట్రపతి బహుమతి గ్రహీత ఆర్. లీలా ప్రసాదరెడ్డి,ఎం.ప్రసన్న లక్ష్మి , ఎన్ వై.కె.వాలంటీర్లు పాల్గొన్నారు

# గొర్రెలు,మేకలలో సామూహిక నట్టల నివారణ

-డాక్టర్ వాస శ్రీనివాస.



ముద్దనూరు అక్టోబర్ 18 (తరణ విలేఖరి)ముద్దనూరు మండలములోని కే. తిమ్మాపురం, వేల్పుచర్ల గ్రామములో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం డాక్టర్ వాసా శ్రీనివాస డాక్టర్ హిమ బిందు ఆధ్వర్యంలో జరిగినది. తిమ్మాపురం లో 2550 గొర్రెలకు, 270 మేకలకు వేల్పుచర్ల గ్రామములో 1860 గొర్రెలకు, 650 మేకలకు నట్టల నివారణ మందు త్రాపించడము జరిగినదిలి . ఈ మందు త్రాపించడము వలన జీవల కడుపులోని బద్దె పురుగులు, ఎలిక పాములు, నులి పురుగులు నివారించ బడుతాయి. తద్వారా గొర్రెలు , మేకలో జీర్ణ శక్తి పెరిగి ఆరోగ్యముగా పెరుగుతాయి. త్వరగా ఎక్కువ బరువు పెరుగుతాయి. అందువల్ల గొర్రెల యజమానులకు ఎక్కువ లాబాలు కలుగుతాయి. మన మండలములో 62,000 గొర్రెలు 16,000 మేకలు వున్నాయి. ఈ సామూహిక నట్టల నివారణ కార్యక్రమం ఈ నెల 25 వ తేదీ వరకు జరుగుతుంది. ప్రతి గ్రామములోని గొర్రెల కాపరులు యజమానులు వారి జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు త్రాపించుకోవాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో అనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్స్ శశి రేఖ, నాగుమయ్య, యాసీన్, లావణ్య, వీరేంద్ర పాల్గొన్నారు.

# కేవలం రవాణా ఖర్చులు భరిస్తూ ఇసుకను ఉచితంగా ఇవ్వాలనే ప్రభుత్వం ధ్యేయం

## మంత్రి నారాయణ



నెల్లూరు, అక్టోబర్ 18(తరణం బ్యూరో )జిల్లాలో రాబోయే సోమవారం నాటికి ఇసుక ధరలు సాధారణ స్థితికి చేరుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో పి కె పాడు, మినగల్లు, ఇరువూరు, పల్లిపాడు ఇసుక రీచ్లల్లో కూలీల ఖర్చులు , లోడింగ్ చార్జీలు, రవాణా చార్జీలు తదితర పనులు చేయుటకు దాఖలైన టెండర్ల పరిశీలన జరిగింది.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. కేవలం రవాణా ఖర్చులు భరిస్తూ ఇసుకను ఉచితంగా ఇవ్వాలనే ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇటీవలి క్యాబినెట్ సమావేశంలో కూడా ముఖ్యమంత్రి ఇసుక పంపిణీ విషయమై స్పష్టమైన ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు అవసరమైన వారికి ఇసుకను ఉచితంగా అందించుటకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఈనెల 21వ తేదీ నాటికి ఇసుక ధరలు సాధారణ స్థితికి ఖచ్చితంగా చేరాలన్నారు. ఇసుక రీచ్ ల విషయమై అక్టోబర్ 15 వరకు ఎటువంటి చర్యలు చేపట్టరాదని సుప్రీంకోర్టు, హరిత ట్రిబ్యునల్ ఆదేశాలున్నందున, ప్రస్తుతం ఇసుక పంపిణీకి తదుపరి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో మొత్తం పది స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు ఓపెన్ రీచ్ లలో దాఖలైన టెండర్ల పరిశీలన జాయింట్ కలెక్టర్ సమక్షంలో వీడియో సాక్షిగా పరిశీలన జరుపుతున్నామన్నారు. నిబంధనల మేరకు కూలీలకు చెల్లించాల్సిన కూలీ ఖర్చులు , లోడింగ్ అన్లోడింగ్ చార్జీలు, రవాణా చార్జీలు, ఆయిల్ ఖర్చులు తదితర అన్ని ఖర్చులకు పరిగణలోకి తీసుకొని ధరలు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఆయా ఖర్చులను గమనంలోకి తీసుకోకుండా అతి తక్కువ ధర కోట్ చేసిన వారిని ఎంపిక చేయలేమని, వారి సాంకేతిక అర్హతలను పరిశీలించిన పిదప నిబంధనలకు లోబడి మాత్రమే ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. తక్కువ ధర కోట్ చేసి, అనంతరం ప్రజలను ఇబ్బంది పెట్టే ఎటువంటి చర్యలను ప్రోత్సహించమని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# విజయవంతమైన వాల్మీకి జయంతి వేడుకలు

- జాతీయ స్థాయి లో వాల్మీకి జయంతి నిర్వహించాలి
- వాల్మీకులని ఎస్టీ జాబితా లో చేర్చాలి
- వాల్మీకి మహా సేన నేతలు



మదనపల్లి అక్టోబర్ 18, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి అని మదనపల్లి శాసన సభ్యులు మహమ్మద్ షాజహాన్ బాషా పేర్కొన్నారు. స్థానిక చెంబకూరు రోడ్డు రాగినాను సర్కిల్ వద్ద వాల్మీకి ఆలయంలో జరిగిన జయంతి వేడుకల్లో వాల్మీకి మహాసేన ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాశి హరికృష్ణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వాల్మీకి మహర్షి కి పూజలు నిర్వహించి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా రామాయణం గొప్పదనాన్ని చాటి చెప్పడంతో పాటు ఆదర్శవంతమైన జీవితాన్ని మానవ విలువలను మహర్షి చాటి చెప్పారన్నారు. వాల్మీకుల అభివృద్ధి తమ బాధ్యతని, వాల్మీకులకి ఇచ్చిన హామీ కి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. శుక్రవారం మహాసేన ముత్తరాశి హరికృష్ణ, కృష్ణమూర్తి లు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా జయప్రదం చేయడం జరిగిందని, వచ్చే ఏడాది కల్లా జాతీయ స్థాయి లో నిర్వహించాలని కోరారు. వాల్మీకులల్లో వున్న వ్యత్యాసాలు తొలగించి వాల్మీకులందరినీ ఎస్టీ జాబితాలో పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు వై.విజయకుమార్, జిల్లా నాయకులు ముత్త రాసి రవి, మునస్వామి, మదనపల్లి నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులు, బొగ్గిటి చంద్ర, బంగారు శంకర పాల్గొన్నారు.

# తక్కువ ధరకే ఇసుక విక్రయం

- మరో 5 రోజుల్లో ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులోకి
- నెల్లూరు సిటీలో కొత్తగా మూడు ఇసుక రీచ్‌లు
- సెంట్రల్ డివైడర్లలో ఫ్లెక్సీలు నిషేధం
- గోడలకి పోస్టర్ అంటిస్తే...పక్క రోజే తీసేస్తాం
- జిల్లాలో ప్రారంభం కానున్న ఇసుక రీచ్‌లను కలెక్టర్, కమిషనర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి పరిశీలించిన మంత్రి నారాయణ



నెల్లూరు అక్టోబర్ 18(తరణం బ్యూరో )ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరిక మేరకు... ఇసుకను తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలోని కోవూరు, పెన్నానదిలో ప్రారంభం కానున్న...ఇసుక రీచ్‌లను ఆయన...జిల్లా కలెక్టర్ ఆనంద్, కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంబంధిత అధికారులు, టీడీపీ నేతలతో కలిసి సందర్శించారు. ఇసుక రీచ్‌లను వివరాలను కలెక్టర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. ముందుగా స్థానికులు మంత్రి నారాయణను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ...తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే... సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు జూన్ నుండి అక్టోబర్ 15వరకు డ్రెడ్జింగ్ చేయొచ్చు కానీ... ఓపెన్ గా ఇసుక తీయకూడదు అని చెప్పడంతో ఇసుక కొరత కొంతమేర ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వలన ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో మూడు స్టాక్ పాయింట్లు లో 6వేల టన్నుల ఇసుక తీస్తున్నామన్నారు. ఈ ఆరువేల టన్నుల ఇసుకన మన జిల్లాకే కాకుండా...ఇతర జిల్లాలైన ప్రకాశం, బాపట్లకు కూడా పంపించాలని చెప్పడంతో...అందువల్లే కొంత ఏర్పడిన మాట వాస్తవమేనన్నారు. ఆ ఇబ్బందిని అధిగ మించేందుకే...ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు... నెల్లూరు సిటీలో కొత్తగా సోమవారం నుండి మూడు ఇసుక రీచ్ లు రాబోతున్నాయని చెప్పారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా మరో నాలుగు ఇసుక రీచ్ లు వస్తాయన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా రివ్యూ చేయాలని ఇప్పటికే కలెక్టర్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. రేటు తగ్గాలంటే ఇసుక సప్లయ్ పెరగాలని తెలిపారు. నిన్న జరిగిన కేబినెట్‌లో ఇసుక విక్రయాలపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారన్నారు. అన్నీ రీచ్ లు అందుబాటులోకి వస్తే జిల్లా లో రోజుకు 22 వేల టన్నులు ఇసుక అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మరో 5 రోజుల్లో ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులో వుంటుందన్నారు. నెల్లూరు సిటీలోని కాలువల్లో పూడికలు తీయడం వల్లే ఎక్కడ కూడా వరద నీరు ఆగలేదన్నారు. సిటీ అందంగా మారాలన్న ఉద్దేశంతో సెంట్రల్ డివైడర్లలో పోస్టర్లను నిషేధిస్తున్నామన్నారు. ఆల్ రెడీ కొన్ని రాష్ట్రాల్లో దీనిని చట్టం చేశారని...త్వరలోనే మన రాష్ట్రంలో కూడా చట్టం చేస్తామని చెప్పారు. అలాగే నగరంలోని గోడలకు ఎవరైనా పోస్టర్లు అంటిస్తే...పక్క రోజే తీసేస్తామన్నారు. ఫ్లెక్సీలు కూడా 48 గంటలు మాత్రమే ఉంచుకోవాలని...ఆ తరువాత వాటిని కూడా తీసేయాలని...అందుకు ప్రజలందరూ సహకరించాలని మంత్రి కోరారు. అదే విధంగా రోడ్లపై ఆవులు, పశువులు ఉండడం కరెక్ట్ కాదన్నారు. ఎవరి వారు పశువులను వారే షెడ్లలో ఉంచుకోవాలని కోరారు. ముఖ్యంగా రూ. 54 కోట్లతో సిటీలో డ్రైన్లు డిజైన్ చేయమని ఇప్పటికే అధికారుల్ని ఆదేశించడం జరిగిందన్నారు. ఈ విధంగా నెల్లూరు సిటీని వన్ బై వన్ డెవలప్ చేస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. నగరాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని మరో సారి మంత్రి నారాయణ విజ్ఞప్తి చేశారు.

# శ్రీ బాలా త్రిపురా సుందరి దేవి అమ్మవారి కి విశేష పూజలు




నెల్లూరు అక్టోబర్ 18(తరణం బ్యూరో )సైదాపురంలో కొలువై ఉన్న శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు విరివిగా పాల్గొని రాహుకాల పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.ఉభయ దాతలుగా శిరీషా నాయుడు వ్యవహరించారు.

# నిమ్మ,మామిడి, సపోటా, జామ పంటలు కు ప్రభుత్వం నుంచి రాయితీ

**ఉద్యాన శాఖ అధికారి**

**ఆనంద్ వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి**



నెల్లూరు అక్టోబర్ 18(తరణం బ్యూరో )ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వ రాయితీ ఇస్తోందని,ఆయా పంటలు సాగు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి ఆనంద్ సూచించారు. సైదాపురం మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయనతోపాటు మండల వ్యవసాయాధికారిణి హైమావతి పాల్గొని రైతులకు అవగాహన కలిగించారు.సైదాపురం మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న రైతులకు అధికారులు అవగాహన కలిగించారు. అనంతరం పొలాల వద్దకు వెళ్ళి ఏయే పంటలు సాగు చేయాలి.. దిగుబడులు ఎలా సాధించాలి అన్నవాటిపై వ్యవసాయ మరియు ఉద్యాన శాఖాధికారులు రైతులకు వివరించారు.అనంతరం ఉద్యాన శాఖాధికారి ఆనంద్ మాట్లాడుతూ.. ఉద్యాన పంటలపై రైతులు మొగ్గు చూపాలన్నారు. నిమ్మ, మామిడి, సపోటా, జామ వంటి పంటలు సాగు చేయాలని సూచించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఏ.వో హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్.పి ఆదేశాల మేరకు బహిరంగ మద్యపాన నిరోధానికి పోలీసుల చర్యలు

**జిల్లా ఎస్.పి కి కృతజ్ఞతలు తెలిపిన యువత**



కమలాపురం, అక్టోబర్ 17(తరణం విలేకరి) బహిరంగ ప్రదేశాలలో మద్యపానం సేవించరాదని అలా సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రోషన్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు గురువారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వర్లు ఉత్తర్వులు మేరకు కమలాపురం సిఐ ఎస్.కె రోషన్ మరియు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, సిబ్బంది సహకారంతో పోలీస్ స్టేషన్ పరిధిలో కంపచెట్లు, ఇతర పిచ్చి మొక్కలను తొలగించి క్రీడా మైదానాలుగా తీర్చిదిద్దారు. కమలాపురం టౌన్ లోని షాదీఖానా, రైల్వే స్టేషన్, గఫర్ పెట్రోల్ బంక్, పుత్తా కాలేజ్, కోగటం రోడ్డు, మొదలగు ప్రదేశాలలో బహిరంగ మద్యపానం చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు, ఆ 12 ప్రదేశాలను పోలీసు సిబ్బంది శుభ్రపరచి అక్కడ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగడానికి ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ ప్రదేశాలను యువత కోసం క్రీడామైదానాలుగా తీర్చిదిద్ది క్రికెట్, వాలీబాల్ ఆడుకునే విధంగా చర్యలు తీసుకున్నందుకు యువత గౌరవ కడప జిల్లా ఎస్పీ కి స్థానిక పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డికి అభినందనల వెల్లువ



– కడప అక్టోబర్ 18 – (తరణం విలేఖరి), కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి కి వ్యాపారస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభినందనలను తెలియజేశారు.ఇటీవల తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా నగరంలోని పలు సర్కిల్ కూడలిలలో నీరు నిలువ ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురికావడం జరిగింది. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి వెంటనే రంగంలోకి దిగి మున్సిపల్ అధికారులకు మరియు సిబ్బందికి సూచనలు ఇస్తూ ట్రాక్టర్లతో నిలువ ఉన్న నీటిని డ్రైనేజ్ కాలువలోకి పంపిస్తూ సమస్యను పరిష్కారం చేసి అన్ని వర్గాల ప్రజలకు ఉపశమనం కలిగించారు.నగరంలోని అప్సర సర్కిల్ లోని వర్ష పు నీటిని పైపులైన్ల ద్వారా.. తాత్కాలిక చర్యలు చేపట్టి నీటిని గంటల వ్యవధిలోనే తొలగించి చిన్న చౌక్, కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించిన కడప శాసనసభ్యురాలు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి, కడప కార్పొరేషన్ అధికారులకు, మరియు జిల్లా యంత్రాంగానికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అమలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- వాల్మీకులను అన్ని విధాల అభివృద్ధి చేస్తాం ఆదుకుంటాం**

**-ఎమ్మెల్యే షాజహాన్ భాష**

**- వాల్మీకిల ఎస్టీ వర్గీకరణకు ప్రధాని మద్దతు**

**- బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్**





మదనపల్లి అక్టోబర్ 18, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :అయోధ్య లో ఎయిర్పోర్టుకు ప్రధాని వాల్మీకి మహర్షి పేరు పెట్టడం పైన వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు హర్షం ప్రకటించారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతిని పురస్క రించుకొని స్థానిక నీరు గుట్టువారి పల్లెలో వాల్మీకి జయంతి వేడుకలు పులి శ్రీనివాసులు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు మహమ్మద్ షాజహాన్ భాష, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్డిఏ కూటమి ప్రభుత్వం వాల్మీకుల ఎస్టీ జాబితా ను అమలు చేసి చిరకాల స్వప్నం నెరవేర్చాలని కోరారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా నిరంతరం ప్రజల్లో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితప్పిస్తున్నారని కితాబునిచ్చారు. గత 68 ఏళ్ళ గా కోల్పోయిన రిజర్వేషన్ పునరుద్దరణ మాత్రమే వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రధాన లక్ష్యం అన్నారు. వాల్మీకుల క్షేమం కోరే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన పాలనలోనే ఎస్టీ పునరుద్ధరణ సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. వాల్మీకి మహర్షి జయంతిని పండుగలాగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ అన్నింటా వెనుక బాటు కు గురైన వాల్మీకి బోయల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలుగా తాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి పూర్తిగా సహకరిస్తామని ప్రకటించారు. ఎస్టీ రిజర్వేషన్ల అంశం పైన ప్రత్యేకంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేయడానికి తోడ్పాటును అందిస్తామన్నారు. గతంలో రాజకీయ కక్షలో భాగంగానే రిజర్వేషన్లలో వాల్మీకి బిడ్డలపై వివక్ష చూపించారని ఆరోపించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో 200 పక్కా ఇండ్లు వాల్మీకులకు కేటాయిస్తామన్నారు. వాల్మీకులను ఆదుకునే బాధ్యత తనదేనన్నారు. సాయి లోకేష్ మాట్లాడుతూ వాల్మీకుల దీర్ఘకాలిక సమస్య ఎస్టీ రిజర్వేషన్లు అపరిస్కృతం గానే ఉన్నదని దానిని పరిష్కరించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ను కర్నూల్ వేదికగా ప్రధాని మోడీ మద్దతూ తెలిపిన విషయాన్ని గుర్తు చేసారు. ఇందులో న్యాయం చేయడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమం లో వాల్మీకి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాయచోటిలో నెంబర్ ప్లేట్స్ లేని వాహనాల పై స్పెషల్ డ్రైవ్

**నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే**

**చర్యలు తప్పవు**

**ప్రతి వాహనదారుడు ఖచ్చితమైన,రికార్డులు**

**కలిగి ఉండాలి.ట్రాఫిక్ సి ఐ విశ్వనాథ రెడ్డి**



అన్నమయ్య అక్టోబర్ 18 (తరణం బ్యూరో) అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో శుక్రవారం ట్రాఫిక్ సిఐ విశ్వనాథరెడ్డి నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు సంబంధించిన ఖచ్చితమైన రికార్డులు కలిగి ఉండాలన్నారు.నెంబర్ ప్లేట్ లు ఉన్న వాహనాలు ప్రమాదాలు,దొంగతనాలు జరిగినప్పుడు సి సి పుటేజి ల ఆదారంగా గుర్తించేందుకు అవకాశం ఉంటుందని ప్రతి వాహనదారుడు నెంబర్ ప్లేట్ అమర్చుకోవాలని వాహనదారులకు హెచ్చరించారు ట్రాఫిక్ సిఐ విశ్వనాథ రెడ్డి.అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఎస్పి విద్యాసాగర్ నాయుడు,డిఎస్పి కృష్ణ మోహన్ ఆదేశాలు మేరకు ట్రాఫిక్ పోలిసు సిబ్బందితో కలిసి నెంబర్ ప్లేట్స్ లేని వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిఐ విశ్వనాథ రెడ్డి.నెంబర్ ప్లేట్ లేకున్నా, దెబ్బ తిన్న వాహనాలను గుర్తించి నెంబర్ ప్లేట్స్ ను ఏర్పాటు చేయించి, భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు లేకుండా చేసుకోవాలని వాహనదారులను హెచ్చరించారు. రోడ్డు పై ప్రయాణించే ప్రతి వాహన దారుడు రవాణా శాఖ నియమాలతో పాటు ట్రాఫిక్ నిబంధలను తప్పకుండా పాటించాలన్నారు.వాహనాల రికార్డులు,వాహనాలను గుర్తించేపరికరం నెంబర్ ప్లేట్ ఉన్నప్పుడే ప్రమాదాల బారిన పడిన ,దొంగతనాలు జరిగిన ఆయా వాహనాలను గుర్తించడానికి సులభతరంగా ఉంటుందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎ యస్ ఐ జోసెప్ , సిబ్బందిచంద్ర శేఖర్, మనోహర్, ఖదీర్. తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ వారోత్సవాలు

**మండల యువ నాయకుడు మదన్మోహన్**



లక్కిరెడ్డిపల్లి అక్టోబర్ 18 తరణం విలేఖరిమండలంలో రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి యువ నాయకుడు మదన్మోహన్ ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి చేసిన ఎం ఆర్ ఓ, లక్ష్మీ ప్రసన్న ఎండిఓ రెడ్డయ్య ,సుబ్రహ్మణ్యం,వెంకటతి చౌటపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలవలు ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడం.ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు పల్లెల్లో అభివృద్ధిని ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు ఏడు రోజులపాటు పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో త్రాగునీరు, విద్యుత్తు, రహదారులు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 4500 కోట్లతో 30 వేల పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీంతో ప్రతి గ్రామంలో నూతన శోభసంతరించుకోనుందన్నారు.ఇప్పుడు శంకుస్థాపనలు చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రభుత్వం పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న కొబ్బరికాయ కొట్టి సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర గురు స్వామి , ప్రతాప్ రెడ్డి,ఆదిమూలం వేమయ్య,కావాలి ఆంజనేయులు, వెంకట కృష్ణ,చెల్లు శ్రీనివాస్ యాదవ్( కువైట్) శివశంకర్, ఆదిమూలం రెడ్డి శేఖర్, దండే రామచంద్ర, కుర్ర సునీల్, గిరి, శ్రీనివాసులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆంజనేయులు నాయక్, పంచాయతీ సెక్రటరీ మధుసూదన్, నాగరాజు, రెడ్డి ప్రసాద్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు సంఘాలకు జీవం పోసిన చంద్రబాబు

**...కొణతాల వెంకటరావు.**




(అనకాపల్లి. అక్టోబర్18,తరణం ప్రతినిధి)పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత,సమ్మిళత వృద్ధి సాధనకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పలు పథకాలను ప్రవేశ పెడుతూ ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలు 10 నుండి15 మంది సభ్యులతో రోజుకు రూపాయితో పొదుపు చేస్తూ బ్యాంకులలో ఎకౌంట్లో ప్రారంభించి ఆరు మాసాల తర్వాత బ్యాంకులో రుణ సౌకర్యం కల్పించే విధంగా నాడు చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా నేడు ఆ సంఘాలకు 20 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు తెలిపారు.సక్రమంగా బ్యాంకులకు రుణాలు చెల్లించే వారికి 5 లక్షల వరకు సున్నా వడ్డీని ప్రభుత్వమే వడ్డీ లో కొంత భాగాన్ని చెల్లించేవారని, గత జగన్ రెడ్డి ప్రభుత్వం నీరుగార్చిన ఉన్నతి పథకాన్ని పునర్ ప్రారంభించి దానిని తిరిగి పీఎం ఉన్నతి పథకానికి కూటమి ప్రభుత్వం ఇటీవల అనుసంధానించడం జరిగిందని,తద్వారా ఎస్సీ ఎస్టీ మహిళల వడ్డీ భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా చేయడం చంద్రబాబు నాయుడు మహిళలకు కల్పించిన చక్కటి అవకాశం అని వెంకటరావు అన్నారు.1999 సంవత్సరంలో అనకాపల్లి పట్టణం మరియు జిల్లా వ్యాప్తంగా ఒక విప్లవ%శీ% లా మహిళలలో చైతన్యం రావడంతో ప్రతి వార్డులో గ్రామాలలో పొదుపు సంఘాలు ఏర్పాటుకు మహిళలు ముందుకు వచ్చారని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల బ్యాంకు రుణాలతో, అంతర్గత రుణాలతోను మహిళలు చిరు వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుకున్నారని,ఈనాడు వారి కుటుంబంలో ఒకరు ఉద్యోగం చేస్తున్నారని, కొంతమంది భారీ స్థాయిలో ఉమ్మడిగా ఉత్పత్తి కార్యక్రమాలు చేపడుతూ, మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారని,సంచులు తయారీ,భోజనం ప్లేట్లు ఇంటి వద్దనే కుటుంబ సభ్యులు తయారు చేసి షాపులకు అమ్మకానికి ఇస్తున్నారని, దీనివల్ల లాభాలు రావడంతో భారీ స్థాయిలో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారని వెంకటరావు తెలిపారు.కార్యక్రమం లో టౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాయల ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో దీపం పథకం ద్వారా అనేక వేల మందికి మహిళలు గ్యాస్ కనెక్షన్ లు లబ్ధి పొందరని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలు మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు పీఎం అజయ్ అనుసంధానం ద్వారా డ్వాక్రా సంఘాలలో ఎస్సీ మహిళలకు 50శాతం రాయితీ రుణాలు ఇస్తారని ఇందులో భాగంగా లక్ష నుండి మూడు లక్షల వరకు రుణాన్ని మంజూరు చేస్తారని,ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన డ్వాక్రా మహిళల ఆర్థిక స్వాలంబనకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన సున్నా వడ్డీ రుణాలు మూడు లక్షల నుండి ఐదు లక్షల పెంచడం జరిగిందని,ఈ సంఘాల ద్వారా స్వయం ఉత్పత్తి కేంద్రాలుగా మార్చే దిశగా అడుగులు వేస్తుందని, చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని, గ్రామీణ మహిళలను వాళ్ల కాళ్లపై ఆర్థికంగా నిలబడే లాగా,ఆర్థికంగా భరోసా కల్పించేలా పలు చర్యలు చేపడుతుందని ప్రసన్న లక్ష్మి అన్నారు.సి డి ఎస్ మాజీ చైర్మన్ కోట్ని ఉమా మాట్లాడుతూ దీపావళి నుండి ఎన్నికల హామీలు ఉచిత గ్యాస్ సిలిండర్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని వెంకటరావు ఉమా ప్రసన్న అన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి మాటలకు,చేతలకు పొంతన లేదు

### చెప్పేది ఒకటి ..చేసేది మరొకటి
### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,, ఏపీసీసీ
### ముఖ్య అధికార ప్రతినిధి.



కమలాపురం, వేంపల్లి అక్టోబర్ 18(తరణం విలేఖరి)ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి మాటలకు,చేతలకు పొంతన లేదు.టిడిపి కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం.ఇంకా తగ్గిస్తాం అని,వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే జీవో 22 ను రద్దు చేస్తామని ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చి 4 నెలలు దాటి నా. . జీవో 22 ను రద్దు చేయలేదు.ట్రూ అప్ చార్జీల పేరుతో 2022-23కు రు 8114 కోట్లు,2023-24కు రు 11826 కోట్లు అదనపు భారం విద్యుత్ వినియోగదారుల మీద వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.అధికారం లోకి వస్తే 20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చింది .4 నెలలు దాటినా 20 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు.పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పోస్ట్ 4 నెలలుగా ఖాళీగా వుంది.అందువల్ల నోటిఫికేషన్లు, షెడ్యూల్లు విడుదల కావడం లేదు.వాయిదా పడ్డ గ్రూప్1,2 పరీక్షల నోటిఫికేషన్లు రాలేదు.21 రకాల పరీక్షలు పెండింగ్ లో ఉన్నాయి.లక్షలాది మంది నిరుద్యోగ యువత వేల రూపాయలు ఖర్చు పెట్టి శిక్షణ తీసుకుంటూ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. రాయలసీమను రతనాల సీమ చేస్తానని చంద్ర బాబు చెప్పడం హాస్యాస్పదం.2023 డిసెంబర్ 4 న కేంద్ర ప్రభుత్వం కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడకు సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేయగా చంద్ర బాబు ప్రభుత్వ 2024 సెప్టెంబర్ 24 న జీవో 56 ద్వారా దీనిని అమరావతికి తరలించింది.ఇది దుర్మార్గమైన చర్య. 1.ట్రూ అప్ చార్జీల భారం విద్యుత్ వినియోగదారుల మీద మోపవద్దు.2.వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీవో 22 ను రద్దు చేయాలి.3.పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పోస్టును వెంటనే భర్తీ చేసి నోటిఫికేషన్లు విడుదల చేయాలి.4.జీవో 56 ను రద్దు చేసి ఎమ్. ఎస్ఎం ఈ సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలోనే కొనసాగించాలి. కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము. అని తులసి రెడ్డి అన్నారు

# ప్రభుత్వ నూతన పాలసీలు రాష్ట్రప్రగతిని మారుస్తాయి

### -టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్.



కడప, చిన్న చౌక్, అక్టోబరు-18-(తరణం విలేఖరి)-వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలకల్పనే లక్ష్యంగా ఆరు నూతన పబ్లిక్ పాలసీలకు ఎ పి క్యాబినెట్ ఆమోదం తెలిపిన శుభ సందర్భంగా కడపజిల్లా టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దగల అంబేద్కర్ కూడలిలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ అధ్వర్యంలోవిద్యార్థులు, యువతతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త అనే ఆలోచనతో కొత్త పాలసీలు తీసుకరావడం రాష్ట్ర ప్రగతిని మారుస్తాయని అనడంలో సందేహం లేదన్నారు.మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపిన ఆరు పాలసీలు-1) ఎ పి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసి.2) ఎ పి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసి.3) ఎ పి ఫుడ్ ప్రాసెసింగ్ పాలసి.4) ఎ పి ఎం.ఎస్.ఎం.ఈ ఎంటర్ ప్యనర్ డెవలప్మెంట్ పాలసి.5) ఎ పి ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పాలసి.6) ఎ పి ఎలక్ట్రానిక్స్ పాలసి.జాబ్ ఫస్ట్ అనే ఆశయంతో ఈ పాలసీలు రూపకల్పన చేయడం ఇదొక గేమ్ చేంజ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పాలసీలు రూపొందించడం శుభ పరిణామమని రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలోరాష్ట్రం అభివృద్ధి పథంలో నడవడం తథ్యమని అందుకు నిదర్శనమే ఈ నూతన పాలసీలు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్షయ్ కుమార్ రెడ్డి, నాయకులు బిల్లా నవీన్, ఫరీద్, హర్ష, శివానందరెడ్డి, వర్ధన్, వెంకటేష్, శ్రీను, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఫాసిస్ట్ విధానాలకు బాసటగా బాబు, జగన్ ఉన్నారు

### -రాష్ట్రప్రజల ప్రయోజనాలను బాబు, మోడీకి తాకట్టు పెడుతున్నారు.
### -డిసెంబర్ 14,15 తేదీలలో సీపీఎం కడపజిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయండి.
### -సిపిఎం జిల్లాకార్యదర్శి జి.చంద్రశేఖర్.



కడప, చిన్న చౌక్, అక్టోబరు-18-(తరణం విలేఖరి)-సిపిఎం కడప జిల్లా 12వ మహాసభలు, కడప నగరంలో డిసెంబర్ 14, 15, శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తో కూడిన జిల్లాకమిటీ సభ్యులు అక్టోబర్ 18 వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు కడప స్థానిక భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) జిల్లా కార్యాలయంనందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలియజేశారు. అందుకు సంభందించిన కరపత్రాలను సైతం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ... నేడు భారతదేశంలో ఇటీవల జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికల్లో, నరేంద్ర మోడీ, బిజెపి తన సొంతబలాన్ని పూర్తిగా కోల్పోయి, మిత్రపక్షాలైన టిడిపి, జె డి యు, బాబు, నితీష్ లపై ఆధారపడి నడుస్తోందని గుర్తుచేశారు. బిజెపి ఫాసిస్ట్ విధానాలకు నాటి ఎ పి సి ఎం జగన్మోహన్ రెడ్డి అండగా నిలిస్తే, నేడు చంద్రబాబు నాయుడు బాసటగా ఉన్నారని ఎద్దేవాచేశారు. సొంత ప్రయోజనాలకోసం జగన్ అడుగు జాడల్లోనే, మోడీ సర్కారు చంద్రబాబు మద్దతుతో నడుస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను బాబు మోడీకి తాకట్టు పెడుతున్నారని దీనిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. నాడు జగన్ తన ఎంపి ల బలాన్ని ప్రాజెక్టులకు నిధులు సాధించడానికి కాకుండా కేంద్రంపై ఒత్తిడి లేకుండా బిజెపి పని సులభం చేశారని, నేడు చంద్రబాబు నాయుడు చేస్తున్న పని కూడా అదేనని, వీరి ఇరువురు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెట్టినవారుగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. మరోవైపు జనసేన పవన్ కళ్యాణ్ తన నటన చాతుర్యంతో తిరోగమన విధానాలైన ఆర్ఎస్ఎస్, వి హెచ్ పి, భజరంగ్ దళ్, బిజెపి, సనాతన ధర్మంపేరిట మళ్లీ దేశంలో, రాష్ట్రంలో మతవ్యవస్థను, కుల వ్యవస్థను, వర్ణ వ్యవస్థను, కుల వివక్షతను, స్త్రీ స్వేచ్ఛ హరణ, మైనార్టీలపై వివక్షత, దాడులుపెంచే బిజెపి అజెండాను నెత్తినెత్తుకొని ప్రచారం చేస్తున్నాడని, ప్రజలు వీరి అజ్ఞానాన్ని చూసి, విని, ముక్కున వేలేసుకొని చూస్తున్నారని, అయినా ఆయన ధోరణిలో మార్పు రాలేదన్నారు. రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజల మానసిక అభివృద్ధిని, పురోగతిని, తిరోగమనంవైపు మళ్ళించాలని చూస్తే ప్రజలు ఎప్పటికీ అటువంటివారిని క్షమించరని హెచ్చరించారు. వారు 12వ మహాసభలను గురించి వివరిస్తూ మొదటిరోజు ప్రదర్శన, "బహిరంగ సభ" నిర్వహిస్తామని, అందులో సిపిఎం జాతీయ, రాష్ట్ర నాయకత్వం పాల్గొంటారని తెలిపారు. రెండవ రోజు "ప్రతినిధుల మహాసభ"లలో కడపజిల్లా సమగ్ర అభివృద్ధిపై, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికై, పారిశ్రామిక అభివృద్ధి కొరకు, వ్యవసాయ సంక్షోభంనుండి రైతాంగాన్ని వెలుపలకు తెచ్చే చర్యలపై, కార్మికవర్గం పనికితగ్గ వేతనం కొరకు, విద్యార్థి, యువకుల ఉపాధి అవకాశాల అభివృద్ధికి, మహిళల స్వేచ్ఛ, భద్రత, ప్రగతి కొరకు, మైనార్టీల రక్షణకు "సబ్ కమిటీ"లు వేసి చర్చించి "తీర్మానాలు" చేసి భవిష్యత్తు మూడు సంవత్సరాల ఉద్యమాల, పోరాటాల, కార్యక్రమాలు, రూపొందిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాచార చట్టంపై అవగాహన ఉండాలి

### సమాచార చట్టాన్ని వినియోగించుకోవాలి




కమలాపురం, అక్టోబర్ 18 (తరణం విలేఖరి)మండలంలోని రైతుసేవా కేంద్రం సహాయకులకు, రైతులకు వీరాపునాయునిపల్లె రైతు సేవా కేంద్రం నందు గురువారం నాడు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమన్ని మండల వ్యవసాయధికారి శ్యామ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 6,7 (1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తి స్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇవ్వని సందర్భాల్లో సమాచార అధికారిపై జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవడం ప్రజల హక్కు, సమాచార హక్కు చట్ట ప్రకారం కోరిన సమచారం అందుబా టులో లేకుంటే సంబంధిత శాఖ అధికారులకు సదరు దరఖాస్తును బదలాయించ వచ్చునన్నారు. కార్యక్రమంలో మండల రైతుసేవా కేం ద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ భాదితులకు ఉచితంగా విగ్గులు పంపిణీ

### - స్వచ్ఛందంగా 63 మంది కేశాలు దానం
### - హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్



మదనపల్లి అక్టోబర్ 18, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :మదనపల్లి ముఖ్య కేంద్రం గా రక్తదానం,ఫుడ్ బ్యాంక్స్, సానిటరి ప్యాడ్ బ్యాంక్స్, బాడీ ఫ్రీజర్ బాక్స్ సేవలతో పాటు క్యాన్సర్ భాదితులకు మానసికంగా అయిన తోడుగా నిలుస్తోంది. శుక్రవారం తంబళ్లపల్లి కి చెందిన షాబాన ఖాన్ హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి క్యాన్సర్ బాధితుల కోసం కేశాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది. కేశాలు దానం చేసిన షాబాన కు ప్రశంస పత్రం తో పాటు పూలమొక్క హెల్పింగ్ మైండ్స్ బృందం అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ తమ సంస్థలో రక్తదాత గా ఉంటూ నేడు కేశాల దాత గా నమోదు అయిన షాబాన స్ఫూర్తి అభినంద నీయం అన్నారు.క్యాన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు తమ సంస్థ పంపిణీ చేసి వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 63 మంది కేశాలు దానం చేశారని, వారిలో మహిళలు, చిన్నారులు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కేశాలు దాత షాబాన మాట్లాడుతూ 4 సంవత్సరాల నుండి హెల్పింగ్ మైండ్స్ సేవల్లో పాలు పంచుకొంటూ తన వంతు గా క్యాన్సర్ భాదితుల కోసం కేశాలు దానం చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్,గుణ పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలు ఉపేక్షించం

### సీఐ పురుషోత్తం రాజు



కడప అక్టోబర్ 18 ( తరణం క్రైమ్ రిపోర్టర్), అక్టోబర్ 18: గ్రామాలలో సంచరిస్తున్న అసాంఘిక శక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఐ పురుషోత్తం రాజు తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని చెన్నూరు కొండపేట గ్రామా లలో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్నటువంటి చోరీలు, ఇసుక అక్రమ రవాణాలు తదితరాల దృష్ట్యా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారి పైన అయినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. గ్రామాలలో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

# జిల్లా అధికారి బ్రహ్మయ్యను మాతృ సంస్థకు పంపించాలి

### - ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్.




కడప అక్టోబర్ 18 - (తరణం విలేఖరి)అంబేద్కర్ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ గా రెగ్యులర్ అధికారులను నియమించకుండా ప్రస్తుతం కడప జిల్లా మైనారిటీ కార్పొరేషన్ జిల్లా అధికారిగా కొనసాగుతున్న బ్రాహ్మయ్య గారికి ఇంచార్జి బాధ్యతలు అప్పగించడం దారుణమని ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కాగితలపెంట లోని ఏ.ఐ.ఎస్.బి జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాలకు ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ గా బ్రహ్మయ్య గారికి అదనపు బాధ్యతలు ఇవ్వడం దారుణమని వారు అన్నారు. బ్రహ్మయ్య రాజంపేట మండలంలోని మన్నూరు హై స్కూల్ ప్రధానోపాధ్యాడుగా ఉన్న వారికి జిల్లా అధికారి బాధ్యతలు అప్పగించడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా బ్రహ్మయ్య గారు ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారుల అండతో వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ మైనార్టీ కార్పొరేషన్, బి.సి, ఎస్.సి, ఎస్.టి వెల్ఫేర్ జిల్లా అధికారిగా ఎస్.సి కార్పొరేషన్ ఈడీ గా బాధ్యతలు నిర్వహించారని వారు తెలిపారు. గ్రూప్ 1 అధికారులు బాధ్యత చూడాల్సిన డిపార్ట్మెంట్ లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని నియమించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. బ్రహ్మయ్య గారు వారి తమ్ముడు గ్రూప్ 1 అధికారి కావడంతో అధికారులను, వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ జిల్లా అధికారిగా కొనసాగుతున్నారని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంచార్జిలతో కాలయాపన చేస్తూ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ గా అదనపు బాధ్యతలు చేపట్టిన బ్రహ్మయ్య గారిని మాతృసంస్థకు బదిలీ చేసి రెగ్యులర్ కో-ఆర్డినేటర్ (డి.సి.ఓ) ని నియమించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చెప్పడతామని వారు హెచ్చరించారు.

# కార్మికులకు అండగా ఉంటా, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత..రవిసింగ్



పఠన్ చేరు, అక్టోబర్ 18 (తరణం ప్రతినిధి): పఠాన్ చేరు నియోజకవర్గంలోని "రాజ్ కమల్ ట్రాన్స్ పోర్ట్" గణేష్ గడ్డ రుద్రారం ఇండస్ట్రీ ఏరియాలో ఎస్.కె ఇబ్రహీం అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుండి పని చేస్తున్నారు, ఏదో రకంగా ఇబ్బంది పెడుతూ డ్యూటీ నుంచి తీసివేయడం జరిగింది, ఇబ్రహీం అనే కార్మికుడికి రావలసిన గత సంవత్సరం 2023, నవంబర్, డిసెంబర్, రెండు నెలల వేతనం 60 వేల రూపాయలు ఇవ్వకుండా, ఇబ్బంది పెడుతూ నిర్లక్ష్యం చేస్తూ కార్మికుడు ఇబ్రహీం నీ ఏదోరకంగా మభ్యపెడుతూ పంపించేవారు, కార్మికునికి ఏం చేయాలో అర్థంకాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని రవిసింగ్ ఆఫీస్ వద్దకు వెళ్లి కార్మికునికి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు. ఆ తర్వాత వెంటనే స్పందించిన, రవిసింగ్ హుటాహుటిన, రాజ్ కమల్ ట్రాన్స్ పోర్ట్, కంపెనీ దగ్గరికి వెళ్లి యజమాన్యంతో మాట్లాడి కార్మికునికి రావలసిన నవంబర్, డిసెంబర్ రెండు నెలలకు రావలసిన అమౌంట్ యాజమాన్యంతో మాట్లాడి ఇప్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ధరణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ అక్టోబర్ 18(తరణం బ్యూరో )పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల్లో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న జిల్లా ప్రజావాణి, సీఎం ప్రజావాణి, పౌర సేవల గుర్తింపు పత్రాలకు సంబంధించిన వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కరించిన తర్వాత దరఖాస్తుదారులు పరిష్కారానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలన్నారు. ఒకవేళ దరఖాస్తును రిజెక్ట్ చేసినట్టయితే దానికి సంబంధించిన కారణాలను రిమార్కుల విభాగంలో పొందుపరచాలాన్నారు. వివాదాస్పద అంశాలతో కూడుకున్న భూ సమస్యల పరిష్కార విషయంలో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యను పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు అందించే పౌర సేవల గుర్తింపు పాత్రల జారీలో ఆలస్యం చేయకూడదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముభాకరక్ దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలించాలన్నారు. ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. తహసీల్దార్లు వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగ్ రావ్, సీపీఓ జీవరత్నం, అన్ని మండలాల తహాశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ రాష్ట్ర పెడరేషన్ కమిటీ లో నిర్మల్ జిల్లా వాసులు

### కామోజీ వేణుగోపాల్, పవన్ కుమార్ ఎంపిక




నిర్మల్ అక్టోబర్ 18(తరణం బ్యూరో ) తెలంగాణ రాష్ట్ర స్థాయి మీసేవ సంఘ ఎన్నికలలో నిర్మల్ జిల్లా వాసులకు పదువులు దక్కయి. అందులో భాగంగా ఖానాపూర్ మీసేవ నుండి కామోజీ వేణుగోపాల్ రాష్ట్ర మీడియా బాద్యులుగా, అలాగే నిర్మల్ జిల్లా కేంద్రం నుండి మెరుగు పవన్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో ఏకగ్రీవంగా ఎంపిక కబడ్డ అధ్యక్షులు భైర శంకర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మోహిద్ లు తమపైన నమ్మకం తో నిర్మల్ జిల్లా కు రాష్ట్ర కమిటీలో పదవులు అప్పాజెప్పారని అన్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర మీసేవ ఆపరేటర్ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గత 10ఏళ్లుగా కమిషన్ పెంచడం లేదని, హామీలు ఇస్తున్నారు తప్ప ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదన్నారు. గృహజ్యోతి కింద మీసేవలకు ఉచిత విద్యుత్ అలాగే, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, పహాణి, వన్ బి సర్వీసులు పునరుద్ధరణ తదితర సమస్యలపట్ల నవంబర్ 4న జరిగే సమావేశం లో సీఎం ని కలవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

# సమాజంలో కవులు, కళా కారుల పాత్ర కీలకం, కవులను ఘనంగా సత్కరించిన..జగదీశ్వర్ గౌడ్

### సాహితీ సాంస్కృతిక కళా సేవా సమితి ఆధ్వర్యంలో అలరించిన కవి సమ్మేళనం, ఇష్టాగోష్టి






శేరిలింగంపల్లి, అక్టోబర్ 18 (తరణం ప్రతినిధి): సమాజాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్ది, ప్రజలను విజ్ఞానవంతులుగా చేసేందుకు కవులు, కళాకారుల పాత్ర కీలకమైనదని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నల్లగండ్ల హుడా కాంప్లెక్స్ లో శేరిలింగంపల్లి సాహితీ , సాంస్కృతిక కళా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం, కవుల ఇష్టా గోష్టి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో ప్రజలను అన్ని రంగాల్లోనూ చైతన్యవంతం చేసేందుకు కవులు కళాకారులు రచయితలు ప్రముఖ పాత్ర వహించడం జరుగుతుందన్నా రు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలను ప్రశ్నించడం, ఉద్యమించటం కవులు, కళాకారుల పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఎందరో కవుల స్ఫూర్తితో ప్రపంచం సంస్కరించ బడుతూ ముందుకు సాగుతుందని ఆయన వెల్లడించారు. అనంతరం శేరిలింగంపల్లి సాహితీ సాంస్కృతిక కళా సేవా సమితి గౌరవ అధ్యక్షురాలు ట్యాగ్ లైన్ కింగ్ డాక్టర్ ఆలపాటి సభాధ్యక్షులుగా వ్యవహరించగా అధ్యక్షులు మోటూరి నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్ర బాబు అరవా ఆధ్వర్యంలో కవుల ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి.డి.రాజగోపాల్, ప్రముఖ పారిశ్రామికవేత్త వినోద్ గౌడ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాడిబోయిన రామస్వామి యాదవ్ ప్రభృతులు హాజరై శేరిలింగంపల్లి సాహితీ సాంస్కృతిక కళా సేవా సమితి భవిష్యత్తు కార్యాచరణ, సాహిత్య, సాంస్కృతిక కళావికాసం, అభ్యున్నతి అనే అంశంపై డాక్టర్ గోగు వెంకటేశ్వర్లు, భమిడిపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ దూత రామకోటేశ్వరరావు, సుమ చంద్ర, డి.వి.ఆర్. మూర్తి, సిహెచ్. రంగనాయకమ్మ, కొలచన విజయభారతి, కండే సుప్రియ,సత్యవీణ మొండ్రేటి, మోదేపల్లి శీనమ్మ, ఉషారాణి, కవి మొగలిమాల, గుండ్ల నారాయణ, కందూరు చంద్రప్రకాష్ గుప్త, పలువురు కవులు, కళాకారులు తమ సలహాలు, సూచనలను అందించారు. సంస్థ ఉపాధ్యక్షులు జేవి కుమార్ వందన సమర్పణ చేశారు. ప్రముఖ కవి దూత రామ కోటేశ్వరరావు రచించిన సభకు నమస్కారం పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం కవి సమ్మేళనం, ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొన్న కవులను శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురు కవులు, కళాకారులు, రచయితలు, తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి నిజమైన స్వాతంత్ర్యం పేదరిక నిర్మూలన

### భేరి రామచందర్ యాదవ్



శేరిలింగంపల్లి, అక్టోబర్ 18 (తరణం ప్రతినిధి):ప్రపంచ పేదరిక నిర్మూలన దినోత్సవ సందర్భంగా ప్రభుత్వాలకు విన్నపం ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో జనాభాలో సగం కంటే కూడా అత్యధిక పేదరికం కలిగిన దేశం మన భారతదేశం, పేదరికం పోవాలంటే ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి, పేదరికం పోవాలంటే నాణ్యమైన ఉచిత విద్యా, నాణ్యమైన వైద్యం అందించాలి, చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి, సమాజంలో అసమానతలు పోవాలి, పేదరికం పోవాలంటే పేదలకు వెనుకబడిన వర్గాలకు వ్యాపార రంగంలో పెట్టుబడులు అందించాలి. ప్రభుత్వాలు పేదరికం పోవాలంటే పేదలు ధనికుల మధ్య తేడాలు పోవాలి అని, అందరికీ గౌరవం దక్కాలి, ప్రభుత్వాలు పేదల పట్ల చిత్తశుద్ధితో అనేక పథకాలు ఆవిష్కరించి పేదల అభివృద్ధికి దోహదపడాలని అన్నారు.

# శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికి ఆదర్శం

### జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నిర్మల్ అక్టోబర్ 18(తరణం బ్యూరో )ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ...ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి వేటగాని వృత్తి తో జీవితం గడిపి సప్తఋషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకి గా మారి అద్భుతమైన రామాయణం గ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకీ అని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని, ఏ వయసులో అయిన పట్టు దళ తో పని చెస్తే విజయం సాధించవచ్చు అని నిరూపించారని కొనియాడారు.ఈ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి యునుస్ అలి, ఆర్ ఐ లు రాంనిరంజన్ రావు, శేఖర్, రమేష్, రామ కృష్ణ, ఆఫీసు సూపర్ఇండెంట్ లు, ఆర్ ఎస్ఐ లు డీపీవో సూపరింటెండెంట్ లు, అయా విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# జాతరలో సామాజిక అవగాహన సదస్సు



ఖానాపూర్ అక్టోబర్ 18(తరణం బ్యూరో ) ఖానాపూర్ మండలంలోని సూర్జా పూర్ గ్రామంలో జరిగిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర జాతరలో సామాజిక అవగాహన సదస్సు ఏర్పటు చేశారు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ వంశీ మాధవ్ సూచనల మేరకు హెచ్ఐవి టీబి తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జాతరకు విచ్చేసిన ప్రజలకు అవగాహన కల్పించారు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర శ్రీ రాజరాజేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరపగా ఇందులో ఐసీటీసీ టి బి ఎల్ టి రామచందర్ వేణుగోపాల్ అన్వర్ శ్రీనివాస్ నారాయణ తదితరులు పాల్గొని పలువురికి పరీక్షలు నిర్వహించారు

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే





ఖానాపూర్ (కడం )అక్టోబర్ 18(తరణం బ్యూరో ) ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలంలోని పెద్దూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు.రైతులు తమ ప్రతి పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దే అమ్మాలని సూచించారు.వరి గ్రేడ్ -ఏ క్వింటల్ కు రూపాయి 2320,సాధారణ వరి క్వింటల్ కు 2300 రూపాయాల ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులెవరు దళారులను నమ్మకూడదని, ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే తమ పంటల అమ్మకాలను చేపట్టాలన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కడెం మండల స్పెషల్ ఆఫీసర్ డి ఆర్ డి ఎ పి డి విజయలక్ష్మి ఆర్ డి వో రత్నాకళ్యాణి అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులుదుర్గా భవాని గోస్కులా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల రక్షణకు కాటమయ్య కిట్ల పంపిణీ

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడి





ఖానాపూర్ అక్టోబర్ 18(తరణం బ్యూరో ) వృత్తిలో గీత కార్మికులకు రక్షణ కల్పించేందుకే కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఖానాపూర్ శాసనసభ్యులువెడ్మ బొజ్జోపటేల్ అన్నారు శుక్రవారం ఖానాపూర్ నియోజకవర్గంలోని క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలోఖానాపూర్, కడం, పెంబి, దస్తురా బాద్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 100 మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన బి సి వర్గాలకు అండగా ఉండేందుకే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఇందులో భాగంగానే గౌడ కులస్తులు గీత కార్మికులకు బీసీ వెల్ఫేర్ తరపున ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులకు అందిస్తున్న దాంట్లో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గల కార్మికులకు ఈ కిట్ల కంపెనీ జరిపామన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తో పాటు డి ఆర్ డి ఓ పి ఓ విజయలక్ష్మి ఎక్సైజ్ సూపర్డెంట్ రజాక్ సీఐ లక్ష్మణరావు మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం వివిధ అధికారులు పాల్గొన్నారు

# గీతంలో విశ్వవిద్యాలయంలో వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

పఠాన్ చేరు, అక్టోబర్ 18 (తరణం ప్రతినిధి):పఠాన్ చేరు నియోకవర్గంలోని రుద్రారంలో గల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'వ్యర్థాల నిర్వహణ%-%వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ఏ అంతర్జాతీయ ఫోరమ్ 2024'పై 14వ అంతర్జాతీయ సదస్సును గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఈ యేడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఈ సదస్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యర్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అనేక ఇతివృత్తాలు, వ్యర్థాలు, విధానాలు, నిబంధనలు, ఇంజనీరింగ్, సాంకేతికత, సామాజిక, వ్యాపారం, పరిశ్రమలు, వ్యవస్థాపకత వంటివి ఉంటాయని తెలియజేశారు. సదస్సులో భాగంగా కీలకోపన్యాసా లు, ప్లీనరీ చర్చలు, ప్రత్యేక సాంకేతిక కార్యక్రమాలు, ప్యానెల్ చర్చలు వంటివెన్నో ఉంటాయన్నారు.విద్యారంగ ప్రతినిధులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలో పనిచేసేవారు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు, ఆరోగ్య పరిరక్షణ సంస్థలు, ఇతర ఆసక్తి గలవారు ఈ సదస్సులో పాల్గొనవచ్చని తెలియజేశారు. నిర్దిష్ట ప్రవేశ రుసుము చెల్లించి వ్యక్తిగతంగా లేదా ఆన్-లైన్-లో ఈ సదస్సుకు హాజరు కావచ్చని, అలాగే కాన్ఫ-రెన్స్ ఈ-ప్రొసీడింగ్-లను కూడా ప్రచురిస్తామన్నారు. ఈ సదస్సుతో పాటు, స్కూల్ కాంగ్రెస్, హ్యాకథాన్, ఇండస్ట్రీ ఎక్స్-పో, ప్రీ-కాన్ఫరెన్స్ డాక్టోరల్ వర్క్-షాపులను నవంబర్ 27న నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ 98300 44464, నిర్వాహకుడు డాక్టర్ వై.ఎల్.పీ.థోరట్ 888 678 5076లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ బాధితులకు 5 లక్షల ప్రకటించడం పట్ల సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎంమ్మెల్యే బొజ్జు పటేల్

## కాంగ్రెస్ నాయకులు



ఖానాపూర్ అక్టోబర్ 18(తరణం బ్యూరో ) బ్రతుకుతెరువు కోసం విదేశాల్లో పనిచేసుకుంటున్న కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఐదు లక్షల ఎన్నారై పాలసీ అమలు చేయడం జరిగింది ఈ మేరకు ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం చేశారు గత అనేక సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న బాధలను ఎవరు పట్టించుకోకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని బలహీన వర్గాల సంక్షేమ పథకాలు భాగంగా విశాల్ లో బతుకుతున్న ఎన్నారై బాధితులకు కూడా 5 లక్షల పాలసీని తీసుకురావడం హర్షనీయమని ఎమ్మెల్యే బొజ్జు అన్నారు ఇచ్చిన హామీలతో పాటు సంక్షేమ పథకాలను కూడా పేదంటే గుమ్మం చేరేవరకు వస్తూనే ఉంటామని ఇది పేద వర్గాల ఇందిరమ్మ రాజ్యం అని త్వరలోనే ఇల్లు లేని పేదలకు స్థలాలతోపాటు ఇళ్లను కూడా నిర్మించే కార్యక్రమం పూర్తి చేశామన్నారు ఇందులో భాగంగా అమ్మ కమిటీలు కూడా వేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుల సత్యం వైస్ చైర్మన్ కావలి సంతోష్ మండల పార్టీ అధ్యక్షులు దయానంద్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ షబ్బీర్ పాషా కడార్ల గంగ నరసయ్య జహీర్ ఖాన్ రాజేందర్ శ్రీపాద శేషాద్రి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు బుక్కా గోవింద్ తదితరులు పాల్గొన్నారు

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

## మాజీ మంత్రులు హరీష్ రావ్, కేటీఆర్ తప్పుడు ప్రచారం మానుకోవాలి : ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్






ఖానాపూర్ (కడం)అక్టోబర్ 18(తరణం బ్యూరో)మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు శుక్రవారం మత్స్య శాఖ రాష్ట్ర మెట్టు సాయికుమార్ తో కలిసి కడెం డ్యాంలో చేప పిల్లలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రభుత్వంపై,మత్స్యశాఖపై బిఆర్ఎస్ అగ్ర నేతలు హరీష్ రావు, కేటీఆర్ లు తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు.గత 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఎం అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.చెరువులో చేపలు లేవంటూ ప్రచారం చేయడం సమంజసం కాదని,అనుమానాలు ఉంటే చెరువులో దూకి చేపలు ఉన్నాయో లేవో తెలుసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు 100% రాయితీతో చేప పిల్లలను అందిస్తుందని అన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందెందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు.సబ్బండ వర్గాల అభివృద్దే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు.ఖానాపూర్ నియోజకవర్గంలో చేపల పెంపక కేంద్రం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.అనంతరం మత్స్యశాఖ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి కుమార్ తో పాటు అధికారులతో కలసి పడవలో ప్రయాణిస్తూ...కడెం ప్రాజెక్టును విక్షించారు.ప్రాజెక్ట్ విశిష్టతను మత్స్య శాఖ చైర్మన్ కు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూమి రిజిస్ట్రేషన్ చేయొద్దని ఎమ్మార్వో వినతి




ఖానాపూర్ అక్టోబర్ 18(తరణం బ్యూరో ) ఖానాపూర్ మండలం లోని బిర్నంది గ్రామ శివారులో గల పొలం భూమి సర్వే నెంబర్ 63,1,63బైఅ 64 గణవి విస్తీర్ణం రెండు ఎకరాముల రెండు గుంటలు కుటుంబ వివాదంతో పాటు జిల్లా కలెక్టర్ ఆర్ డి ఓ సమక్షంలో వివాదంలో ఉందని భాగ్యలక్ష్మి, నర్సారెడ్డి లు తెలిపారు ఈ మేరకు ఎమ్మార్వో మామిడి శివరాజుకు రిజిస్ట్రేషన్ చేయరాదని వినతిపత్రం సమర్పించారు

# బాధిత కుటుంబానికి సీఎం ఆర్ ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన..పిఏసి చైర్మన్ గాంధీ



శేరిలింగంపల్లి, అక్టోబర్ 18(తరణం ప్రతినిధి):కుక్కట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపరాయుడు నగర్ కాలనీ కి చెందిన సమ్మరావుకి వైద్య చికిత్సనిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా (సీఎంఆర్) ద్వారా మంజూరైన 24,000/- ఇరవై నాలుగు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సిఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందచేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ..సీఎం సహాయ నిధి పేద ప్రజలకు గొప్పవరం అనిప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే, గాంధీ. పునరుద్ఘాటించారు. అదేవిధంగా సీఎం సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన చైర్మన్ ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి లేబర్ అడ్డాల దగ్గర కనీస వసతులు కల్పించండి

## ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి.. కె.చందు యాదవ్




శేరిలింగంపల్లి, అక్టోబర్ 18 (తరణం ప్రతినిధి):శేరిలింగంపల్లి ఏఐటీయుసీ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి కే ఖాసీం ఆధ్వర్యంలో కార్మికుల అడ్డా లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయు సీ రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణం సంఘం ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కే చందు యాదవ్ హాజరైన సందర్భం మాట్లాడుతూ..భవన నిర్మాణ కార్మికులందరూ కూడా సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే బహుళ అంతస్తుల నిర్మాణాల ద్వారా రెండు శాతం సెస్సుని కార్మికుల సంక్షేమం కోసంమె ఖర్చు పెట్టాల్సిన ప్రభుత్వాలు దారి మళ్ళించడం కార్మికులను విస్మరించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తున్నాం, భవిష్యత్తులో సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసమే హెచ్చించాలని ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు, ఎక్స్ గ్రేషియాను ఆరు లక్షల నుండి పది లక్షల వరకు పెంచాలని, 55 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికునికి అరు వేలు పెన్షన్ ఇవ్వాలని, కార్మికుల కోసం ఆయా కేంద్రాలలో అడ్డాస్థలాలను, కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని, అర్హులైన కార్మిక సోదరులందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి, ప్రతి అడ్డా కేంద్రంలో ఐదు రూపాయల భోజనం వసతిని కల్పించాలని, ఎఐటియుసి ప్రభుత్వాన్ని కోరుచున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు స్వామి కే.శివకుమార్, అడ్డా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# తెదేపా ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

### - మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి



బ్రహ్మంగారి మఠం, అక్టోబర్ 18(తరణం విలేఖరి) : తెదేపా ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల తెదేపా అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో వెంగమునిరెడ్డి తో కలిసి సోమిరెడ్డి పల్లె, నరసన్న పల్లె పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు యల్లటూరు సాంబశివారెడ్డి, పూజ శివ యాదవ్, సుధాకర్, నాగయ్య, నాగిపోగు గంగయ్య, బాలగాని నారాయణ యాదవ్ తో సహా గ్రామ ప్రజలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు

### గ్రామసభ ఆమోదంతోనే పనులు చేపట్టాలి

### మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి





సిద్ధవటం అక్టోబర్,18(తరణం విలేఖరి) గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామపంచాయతీలపై అవగాహన ఉండాలని శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు మండల కేంద్రమైన సిద్ధోటం మండల అభివృద్ధి కార్యాలయం సభా భవనంలో శుక్రవారం ఎంపీడీవో ఫణి రాజకుమారి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పాలకవర్గ సభ్యులకు గ్రామాల అభివృద్ధి పై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు గ్రామపంచాయతీలో మీకున్న అధికారాలు ఏమిటో ముఖ్యంగా తెలుసుకోవాలని ప్రజల చేత ఎన్నుకోబడ్డ మీరు మీ విధి నిర్వహణ కర్తవ్యం ఏమిటో తెలుసుకోవాలని శిక్షణ కార్యక్రమాలు శుక్ర,శనివారాల్లో జరుగుతాయని ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీలపై అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో ఏదైనా అభివృద్ధి కార్యక్రమాలు జరిగేటప్పుడు గ్రామసభ ఆమోదం తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి , మొహతాజ్ యాస్మిన్ పంచాయతీ సెక్రటరీలు గ్రామ ఉపసర్పంచులు వార్డ్ మెంబర్ సభ్యులు పాల్గొన్నారు

# వాల్మీకి మహర్షి, శ్రీ కృష్ణ దేవరాయలుకు ఘన నివాళులు



రాజంపేట.అక్టోబర్. 18(తరణం ప్రతినిధి) రఘువంశ తిలకుడైన రాముని చరిత్రను సంస్కృత భాషలో రామాయణంగా రచించి వాల్మీకి మహర్షి ఆదికవిగా, ఆంధ్ర విష్ణువు ఆదేశానుసారం ఆముక్తమాల్యదను రచించి శ్రీకృష్ణదేవరాయలు రాజకవిగా వాసికెక్కారని తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం రాజంపేట పట్టణం జవుళీ బజారులో గల సరస్వతీ విద్యా మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి, శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి కార్యక్రమాలను తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బి.వి. నారాయణరాజు తదితరులు వాల్మీకి మహర్షి, శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటాలకు పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణమని, ఇది మానవ హృదయాలనుంచి ఎప్పటికీ చెరగని కథ అన్నారు. రామాయణం కేవలం పారాయణ గ్రంథమే కాకుండా ఆచరణ ప్రధానమైన గ్రంథమని వారు పేర్కొన్నారు. తమిళనాడులోని విల్లుపుత్తూరులో గల ఆలయ పూజారి కూతురు మొదట తాను దాల్చి తర్వాత స్వామికి పూలమాలను అర్పించే అపర భక్తురాలు చివరకు శ్రీరంగనాథుని వివాహమాడి స్వామిలో ఐక్యమైనటువంటి ఆండాళ్ గోదాదేవి కథే ఆముక్తమాల్యద అని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడూరు గౌరీ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.ఫోటో : నివాళులర్పిస్తున్న తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు గంగనపల్లి వెంకటరమణ, బొట్టా రామచంద్రయ్య నాయుడు తదితరులు.

# ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ



మదనపల్లి అక్టోబర్ 18, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :మదనపల్లి ఆర్టీసీ ఒకటవ డిపో నందు ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. శుక్రవారం 2024 సెప్టెంబరు మాసానికి గాను అత్యధిక ఈ.పి.కె సాధించిన కండక్టర్లు ను, టీమ్ డ్రైవర్లను మరియు అత్యధిక కె.ఎం.పి.ఎల్ సాధించిన డ్రైవర్లు ను, అత్యంత ప్రతిభ కన బరచిన మెకానిక్ లను, సూపర్వైజర్లు ను మదనపల్లి ఒకటవ డిపో మేనేజర్ వెంకట రమణ రెడ్డి అభినందించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో యొక్క పెర్ఫార్మెన్స్ తెలియజేశారు. అలాగే ఇదే విధంగా ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజాదరణ ను చురగోనాలన్నారు.

# వెలుగు సంస్థలో అన్నదానం





మదనపల్లి అక్టోబర్ 18, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) :వెలుగు స్వచ్ఛంద సేవ సంస్థ నందు పలమనేరు మాస్ స్వచ్ఛంద సేవ సంస్థ యాజమాన్యం సునంద మరియు దేవదాస్ నాయుడు కుమారుడు వంశీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ వెలుగుకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, వెలుగు ఫౌండర్ స్వర్గీయ పద్మజ తో కలసి ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నామని తను మనతో లేకున్నా తన ఆశయాలు మన మధ్యన ఉన్నాయన్నారు. ఇక ముందుకూడా వెలుగు తో తమ ప్రయాణం కొనసాగాలని కోరుకుంటున్నామని తెలిపారు. వెలుగు సెక్రటరీ యం. ఉదయ్ మోహన్ రెడ్డి సునంద కుటుంబానికి కృతజ్ఞతలు తెలుపుతూ మొమెంటో ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనా కుమారి, వార్డెన్ స్వీటీ, చిన్నారులు, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ఉపసర్పంచులు వార్డు మెంబర్లు భాగస్వామ్యం కావాలి

### ఎంపీడీవో వరప్రసాద్



రాజంపేట.అక్టోబర్. 18(తరణం ప్రతినిధి) గ్రామపంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు భాగస్వామ్యాలు కావాలని రాజంపేట ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాజంపేట ఎంపీడీవో కార్యాలయ సబా భవనంలో మండలంలోని ఉప సర్పంచ్ లకు వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించ్చారు. ఈ సందర్భంగా పంచాయతీలో ప్రస్తుతం పల్లె పండుగ కార్యక్రమంలో చేపడుతున్న టువంటి అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉపసర్పంచులు వార్డు సభ్యులు పంచాయతీలో జరిగే సమావేశాలకు తప్పకుండా హాజరు కావాలని చెప్పారు. పంచాయతీలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిలో భాగస్వామ్యం అయినప్పుడే పంచాయతీ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం -2005 పై అవగాహన



కమలాపురం, అక్టోబర్ 18(తరణం విలేఖరి) క మలాపురం మండలంలోని గ్రామ వ్యవసాయసహాయకులకు శుక్రవారంకమలాపురం మండలంలోని ఎరువులు విత్తనాలుపురుగుమందుల డీలర్లకు రైతులకు సమాచార హక్కు చట్టం– 2005 అవగాహన కార్యక్రమం కమలాపురం మండల వ్యవసాయ అధికారికమలాపురం సహాయవ్యవసాయంశాలకుఏవీనరసింహారెడ్డిసంయుక్తంగా నిర్వహించడం జరిగినది. సమాచార హక్కు చట్టం గురించి పూర్తి వివరాలు సమాచార హక్కు చట్టం ముఖ్యమైన సెక్షన్ల గురించి వివరించడం జరిగినది. సమాచార హక్కు చట్ట ప్రక్రియ మూడు దశలలో ఉంటుందని తెలిపారు. మొదటి దశ ధరఖాస్తు చేయుట సెక్షన్ 6 (1) ప్రతి పౌరుడు అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుండి సమాచారాన్ని అడిగే హక్కు రెండవదశ మొదటి అప్పీల్ – సెక్షన్ 19(1) సెక్షన్ 6(1) క్రింద సమాచారం రానప్పుడు లేదా ఇచ్చిన సమాచారంతో సంతృప్తి చెందనప్పుడు 30 రోజులలోగా పై స్థాయి అధికారికి అప్పిలు చేసుకోవచ్చు మూడవదశ రెండవ అప్పీల్ సెక్షన్ 19(3)సెక్షన్ 19(1) క్రింద సరైన జవాబు రానప్పుడు లేదా సరైన తో సంతృప్తి చెందనప్పుడు నిర్ణయం వెలువడిన 90 రోజు లోపల ధరఖాస్తూ దారుడు సమాచార కమిషనర్ కు అప్పీల్ చేసుకోవచ్చు ఈ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ నాయకులు, కమలాపురం మండలంలో ఎరువులు, పురుగుమందుల, విత్తనాలు డీలర్లు, రైతులు పాల్గొనడం జరిగినది

# రిమ్స్ లో పెన్షన్ అర్హత పత్రం పొందాలంటే! ముప్పై వేలు ఇవ్వాల్సిందే.

### - డబ్బులు ఇచ్చిన వారికే పింఛన్ అర్హత పత్రాలు.,
### - ఆర్ సి పి నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్,



– కడప అక్టోబర్ –18 – (తరణం విలేఖరి)వివిధ రకాల జబ్బులతో, అంగ వైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న "వికలాంగుల పింఛన్" పొందుట కొరకు, అర్హత పత్రం కోసం రిమ్స్ కు వెళితే అక్కడున్న సిబ్బందికి అక్షరాల ముప్పై వేలు చెల్లించుకుంటేనే పింఛన్ కు సరిపడా పర్సంటేజ్ ని వేయిస్తారు, లేకపోతే తొంభై తొమ్మిది శాతం, అవిటితనమున్న పింఛను అర్హత పత్రంలో సరిపడా పర్సంటేజీ వేయడం లేదని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ తెలిపారు.శుక్రవారం రిమ్స్ సూపర్నెంట్ డాక్టర్ రమాదేవి ని తన ఛాంబర్ నందు కలసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ,పింఛన్ అర్హత పత్రాలు అర్హులైన వారికి కాక డబ్బులు ఇచ్చిన వారికే అర్హత కలిగిన పత్రాలు అందుతా ఉన్నాయని, సర్వజన ఆసుపత్రి రిమ్స్ నందు సర్వం దోచుకునే దొంగలు ఎక్కువయ్యారని, పింఛన్ అర్హత పత్రాల కోసం రోగుల దగ్గర డబ్బులను డిమాండ్ చేసి తీసుకున్న వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేని పక్షాన బాధితులైన వారితో డిఎం హెచ్ ఓ, కలెక్టర్, కార్యాలయాల ముందు ప్రత్యక్ష ఆందోళన నిర్వహిస్తామని, ఈ విషయాన్ని సంబంధిత వైద్య శాఖ మంత్రికి వినతి పత్రాల రూపంలో తెలియజేస్తామని, పేదలను పీడించి వేలకు వేలు డబ్బులు తీసుకున్న వారిని విధుల నుండి తొలగించేంతవరకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

కార్యక్రమంలో విజయ్ కుమార్, శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ జిల్లా కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్



(విశాఖపట్నం.అక్టోబర్18,తరణం ప్రతినిధి)ఓ పత్రికపై పరువు నష్టందావా కేసుకు సంబంధించి మంత్రి నారా లోకేశ్ శుక్రవారం విశాఖ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. తప్పుడు కథనాలు ప్రచురించిన పత్రికపై మంత్రి లోకేశ్ రూ.75 కోట్లకు పరువు నష్టం దావా వేశారు.ఉద్దేశపూర్వకంగా తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించడంపై కేసు దాఖలు చేసినట్లు లోకేశ్ తెలిపారు.ఈ కేసుకు సంబంధించి ఆగస్టు 29న తొలిసారి క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయినట్లు లోకేశ్ తరపు లాయర్లు తెలిపారు.

## బ్రహ్మయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన బత్యాల



రాజంపేట.అక్టోబర్. 18(తరణం ప్రతినిధి)రాజంపేట పట్టణం నూనెవారిపల్లి నివాసి టిడిపి నేత వాణిజ్య విభాగం అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు పెదనాన్న ముల్లగూరి బ్రహ్మయ్య శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ ఎమ్మెల్సీ,రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి బత్యాల చెంగల్ రా యుడు హుటాహుటిన రాజంపేట లోని ముల్లగూరు బ్రహ్మయ్య ఇంటికి చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి రవికుమార్



రాజంపేట.అక్టోబర్. 18(తరణం ప్రతినిధి)విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చిట్వేలి రవికుమార్ మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. శుక్రవారం రాజంపేట ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద డివిజన్ కమిటీ సభ్యులు సమావేశమై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని ఎడల కార్మికులంతా ఏకమై మరో మూడు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఈపిఎఫ్ ఈఎస్ఐ కార్మికులకు చట్టబద్ధంగా కట్టాల్సి ఉండగా గత 12 నెలలుగా కార్మికుల ఖాతాలో ఈపిఎఫ్ జమ చేయటం లేదని, ఈఎస్ఐ కట్టకపోవడం ద్వారా కార్మికులు, వారి కుటుంబాలు అనారోగ్యం బారిన పడినప్పుడు వైద్యం చేయించుకునే అవకాశం ఉండి కూడా వైద్యం చేయించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై ఇప్పటికే మూడు దఫాలుగా అధికారులకు విన్నవించినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆందోళన బాట పట్టాల్సి వస్తుంది అన్నారు.యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ న్ డివిజన్ కార్యదర్శి పి బాలకృష్ణ మాట్లాడుతూకోడూరు సబ్ డివిజన్ నందు పది నెలలుగా రెడ్డివారిపల్లి మరియు బాలపల్లి ప్రాంతంలో సిబ్బందిని నియమించకుండా రెండు సబ్ స్టేషన్లు ఓపెన్ చేసి పక్క సబ్ స్టేషన్ లో పనిచేసే కార్మికుల్ని వాడుకుంటూ పని ఒత్తిడి పెంచి భారం కల్పిస్తున్నారని ఇలా చేయడం చట్టబద్ధం కాదని ఇకనైనా కొత్త సిబ్బంది నియమించుకోవాలని తెలిపారు. లేనియెడల అతి తొందరలో రాజంపేట విద్యుత్ కార్యాలయం ఎదుట దశలవారి పోరాటానికి కార్మికులు సిద్ధం అవుతామని చెప్పారు.యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి డి సుధాకర్ మాట్లాడుతూగతంలో ప్రతి ఒక్క సబ్టేషన్కి ఒక నైట్ వాచ్మెన్ ఉండేవాళ్లు ఇప్పుడు ప్రమాదకరమైన సబ్ స్టేషన్ కి వాచ్మెన్ లేకపోవడం వల్ల చాలాచోట్ల కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. కనుక ఇప్పుడు వచ్చినటువంటి కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యల పైన చొరవ తీసుకొని ప్రతి ఒక్క సబ్ స్టేషన్ కు నైట్ వాచ్మెన్ ని నియమించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై అనేకసార్లు రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. నేపథ్యంలో ఈ సమస్య ల పైన, తక్షణమే అధికారులు స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డివిజన్ కమిటీ కోరుతుందని సందర్భంగా తెలియజేస్తున్నామని చెప్పారు.లేనియెడల మరో మూడు రోజుల్లో కార్యచరణ ప్రకటించి పోరాటానికి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలు రవికుమార్ అలాగే టెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి బాలకృష్ణ డివిజన్ అధ్యక్షులు డి సుధాకర్ కోశాధికారి జి చంద్రారెడ్డికమిటీ సభ్యులు హేమకుమార్ రాజు సుబ్రహ్మణ్యం శ్రీనివాసరాజు వేణుగోపాల్ ఉమామహేశ్వర్ శ్రీనివాసులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిష్పత్తిలో అసమానతలను తొలగించి.. సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలి

**-లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు**

**-బాల్య వివాహాల నిర్మునలకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి.**

**-బాల్య వివాహాలు జరిపిన వారి పై కఠిన చర్యలు**

**-పిసి పీఎన్డిటీ పై.. డీఎల్ ఎంఎంపఏ కమిటీ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్ ఇర్వీన్**






కడప, అక్టోబరు, 18 (తరణం బ్యూరో) : సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒకరూ కృషి చేయాలని, లింగ వివక్షతను చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్ ఇర్వీన్ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం లోని థామస్ మన్రో మీటింగ్ హాలులో రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్ ఇర్వీన్ అధ్యక్షత న పిసి పీఎన్డిటీ (గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన) పై..సమావేశం జరిగింది. పిసి పీఎన్డిటీ జిల్లా నోడల్ అధికారి డా. ఉ మ మహేశ్వర కుమార్.. సంబంధిత అధికారులతో.. సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రప్రియేట్ అథారిటీ (డీఎల్ ఎంఎంపఏ) కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్ ఇర్వీన్ మాట్లాడుతూ... బాలల లింగ నిస్పతిని గమనిస్తే.. బాలురతో పోలిస్తే బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఈ అసమానతను తొలగించి.. సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలకు కారకులైన వారికి చట్టపరమైన శిక్షను కూడా విధించడం జరుగుతోందన్నారు. స్కానింగ్ సెంటర్లలోను, ఆస్పత్రుల్లోనూ లింగ నిర్ధారణ, బ్రూన హత్యలు చేయడం.. ఆడ పిల్ల వద్దంటూ.. కుటుంబంలో ఎవరైనా వేధింపులకు గురి చేస్తున్నట్లు సంపూర్ణ ఆధారాలతో తమకు తెలియ జేయవచ్చున్నారు. లింగ వివక్ష జరుగుతోందని, బాధితురాలు కానీ, కుటుంబ సభ్యులు కానీ, ఇతరులు కానీ.. తగు ఆధారాలతో తమ దృష్టికి తీసుకు వస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లింగ వివక్షతపై వ్యతిరేకిస్తూ, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేసే వారికి పిసి పీఎన్డిటీ కమిటీ అండగా వుంటుందన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి.. కఠినమైన శిక్షను అమలు చేయాలన్నారు. ఎక్కడైనా, ఎవరైనా.. లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలో అధికారులు, ఎన్జీవోలు, ప్రజలు అందరినీ భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు, బ్రూణహత్యాలు, గర్భస్రావాలు జరగకుండా ఆపాలని, అందుకోసం ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా.. అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శిలకు ప్రధాన భాగస్వామ్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం బాల్యవివాహాల నిర్ములన పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములై బాల్యవివాహాలను ఆపాలని అన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్న ట్లు తెలిసిన వెంటనే సమాచారం అందించాలని అన్నారు. బాల్య వివాహాలు జరిపిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలోను, ఆస్పత్రుల్లోనూ లింగ నిర్ధారణ, బ్రూన హత్యలకు సహకరించిన వారికి కఠిన చర్యలు తప్పవని అన్నారు.

# మద్యం లాటరీల్లో సురేంద్ర యాదవ్ లక్కే లక్కు

**- 20 ఏళ్లుగా కలిసొస్తున్న అదృష్టం**



మదనపల్లి అక్టోబర్ 18, ( బి. శ్రీనివాసులు రెడ్డి తరణం విలేఖరి ) : అదృష్టం కొందరికి అప్పుడప్పుడు వరిస్తుంది. కొదరికీ అనునిత్యం వారి వెంటే ఉంటూ వారు తలచింది జరుగుతుంది. అన్నమయ్య జిల్లా, కురబలకోట మండలం ముదివేడుకు చెందిన పిల్లంగారి సురేంద్ర యాదవ్ కు 20 ఏళ్లుగా వరుసగా అదృష్టం వరిస్తోంది.ఇతను టిడిపి రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడిగా కూడా క్రియాశీలకంగా కొనసాగుతున్నారు.2000 సంవత్సరంలో ఇతను అంగళ్లులో వైన్ షాపుతో ఈ రంగంలో ప్రవేశించారు. ఆతర్వాత నుండి ప్రతిసారి ఇతనికి వైన్స్ షాపులు పరిపాటిగా దక్కుతున్నాయి. కురబలకోట మండలంలో ఆయనకు ఒకేసారి మూడు షాపులు కూడా వచ్చిన సందర్భాలు ఉన్నాయి.ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ వైన్స్ షాపు కూడా ఓ సారి దక్కించుకున్నారు.ప్రతి సారి ఇతను లాటరీలో వైన్స్ షాపులు తగులుతున్నాయి. దీంతో ఇతను వైన్స్ సూరిగా ప్రసిద్ధి చెందారు. అంతేకాదు వైన్స్ సూరి అంటేనే ఎవరైనా టక్కున గుర్తిస్తారు కూడా.ఈ క్రమంలో ఈసారి గట్టి పోటీలో కూడా ఇతనికి అంగళ్లు వైన్స్ షాపు దక్కడం విశేషం.ఈ షాప్ అన్నమయ్య జిల్లాలోనే ప్రత్యేకత సంతరించుకుంది.దీనికి సూరీ వైన్స్ అని తన పేరే తొలిసారిగా పెట్టుకున్నారు. కలసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లుగా వైన్స్ బిజినెస్ ఇతనికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది.కొందరికి కొన్ని కలిసి వస్తాయి.ఏనాటిదో ఈ బంధం అన్నట్లుగా మద్యం షాపులకు ఇతనికి విడదీయరాని బంధం ఉన్నట్లుగా అన్పిస్తుంది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఇతనికి ప్రత్యేక గుర్తింపు ఉంది.స్వయం కృషితో ఎదిగిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు.దీంతో సురేంద్ర యాదవ్ లక్కేలక్కు అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# కడప నగరంలోని ప్రభుత్వ పాఠశాల లందు మధ్యాహ్న భోజనాల పరిశీలన

**కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి**

**కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్**





కడప, అక్టోబర్ 18 (తరణం ప్రతినిధి )ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారంగా, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడప నగరలో ఉన్న కాగితాల పెంటలో గల ఉర్దూ మండల్ పరిషత్ ప్రైమరీ స్కూల్ నందు, కాగితాల పెంటలో గల తెలుగు మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నందు, కాగితాల పెంటలో గల జిల్లా పరిషత్ ఉర్దూ హై స్కూల్ నందు, ఎర్రముక్క పల్లెలో గల మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ గాంధీనగర్ నందు, మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్ గాంధీనగర్ నందు, చెమ్యూమియా పేట లో గల జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ నందు మధ్యాహ్న భోజనాలను పరిశీలించి పిల్లలకు అందుతున్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు, వంటశాలను, డైనింగ్ హాలును, స్టోర్ రూమ్ను, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మొదలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కడప మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్, హెడ్మాస్టర్లు, వంట సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY KANAGUDURU NAGINI, PRINTED AT MARUTHI WEB PRINTERS, DOOR NO. 37/1342-2-3, CHALAMAREDDY PALLI , THILAKNAGAR, RAMANJANEYAPURAM, POST,KADAPA, Y.S.R / KADAPA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT EDITOR OFFICE 37/1342-2- 3 CHALAMAREDDY PALLI , THILAKNAGAR, RAMANJAYANEPURAM,POST,KADAPA, Y.S.R / KADAPA DISTRICT, ANDHRA PRADESH. EDITOR : N. ANJANEYA REDDY. RNI NO: APTEL/2016/69526, Cell : 7013748049 Email : tharanamkvsm@gmail.com.